క్లుప్తంగా...

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కును మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో లబ్ధిదారుడికి అందజేశారు. పట్టణంలోని 23వ వార్డుకు చెందిన ఒగ్గు సత్తమ్మకు రూ.60 వేల సాయం మంజూరు కావడంతో ఆ చెక్కును మంత్రి మల్లారెడ్డి కౌన్సిలర్ కొడే మహేష్‌తో కలిసి అందజేశారు.

29న జిల్లా సాధన సమితి దశాబ్ది ఉత్సవాలు

మేడ్చల్: మేడ్చల్ జిల్లా సాధన సమితి దశాబ్ది ఉత్సవాలను ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు సమితి అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. మేడ్చల్‌లో నిర్వహించే ఉత్సవాలకు ప్రజాగాయకుడు గద్దర్ అతిథిగా హాజరవుతారని ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు ఉత్సవాల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

నోట్‌బుక్స్ పంపిణీ



ఘట్‌కేసర్‌లో నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: పట్టణంలోని ఈడబ్ల్యూఎస్ కాలనీ తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ పలుగుల మాధవరెడ్డి సొంత నిధులతో నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల తల్లితండ్రులకు ఆర్థిక భారం పడొద్దని నోట్‌బుక్స్ అందజేశామన్నారు. పద్మ, మీనా, వీరేశ్‌గుప్తా, నవీన్, సుబ్బారావు, ఇక్బాల్, నజీర్, విజయ్, ఉపాధ్యాయులు అఖిల, హైమావతి విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల ధర్నాను విజయవంతం చేయాలి

ఘట్‌కేసర్: జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ కన్వీనర్ జయచంద్ర తెలిపారు. ఆందోళనలో జిల్లాలోని పంచాయతీ కారోబార్స్, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య కార్మికులు, స్వీపర్లు, పంపు ఆపరేటర్స్, ఎలక్ట్రీషన్లు, అటెండర్లు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నివాళి



నగేశ్‌కు నివాళులర్పిస్తున్న మండల వీడియో, ఫొటోగ్రాఫర్లు

ఘట్‌కేసర్: ఫొటో, వీడియో వెల్ఫేర్ అసోసియేషన్ మండల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం మరణించిన సీనియర్ ఫొటో గ్రాఫర్ నగేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై బీజేపీ ప్రచారం



కీసరలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

కీసర: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం కీసరలో ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేస్తూ పథకాల గురించి ప్రజలకు వివరించారు. బోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాగల అశోక్ ముదిరాజ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బండారు శ్రీనివాస్‌రెడ్డి, బూత్ అధ్యక్షుడు అంజనేయులు, కార్యకర్త నల్ల నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తున్న వ్యక్తి అరెస్టు

పోచారం: ఇన్‌స్టాగామ్‌లో మహిళలను వేధిస్తున్న వ్యక్తిని పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన దొడ్డి నరేష్(21) ఇన్‌స్టాగామ్, ఇతర సోషల్ మీడియా, సమాచార సాధనాల ద్వారా అసభ్య పదజాలంతో మహిళలను వేధిస్తున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం అరెస్ట్ చేశారు.

లక్షపై నిర్లక్ష్యమేల..?

ధ్రువీకరణ పత్రాలు అందక దరఖాస్తు చేయని వారెందరో..?

- అధికారులు పట్టించుకోలేదని దరఖాస్తుదారుల ఆవేదన
- పైరవీలతోనే పనులు జరిగాయని ఆరోపణలు
- మేడ్చల్ జిల్లాలో 22,077 మంది దరఖాస్తులు
- ఈ నెల 26 వరకు పూర్తికానున్న వాటి పరిశీలన

సాక్షి, మేడ్చల్ జిల్లా: కులవృత్తులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్న బీసీలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం చేయనున్నట్లు ప్రకటించింది. ఎలాంటి పూచీకత్తు లేకుండా పూర్తి రాయితీతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయ్యింది. జిల్లాలో మొత్తం 22,077 మంది బీసీలు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని నిర్ణయించినప్పటికీ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తొలి విడత పథకాన్ని ప్రకటించింది. ఈ నెల 26 వరకు ధ్రువపత్రాల పరిశీలన పూర్తిచేయాల్సింది. నాయీబ్రాహ్మణులు, విశ్వబ్రాహ్మణులు, కుమ్మరి, మేదరి, రజక, పూసలు తదితర కులాల వారికి ఈ పథకం కింద ఆర్థిక సాయం అందించనున్నారు. నిరుపేద, దివ్యాంగులు, వితంతువులకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కుల వృత్తులు చేసుకుంటున్న కుటుంబాల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. జూన్ 7 నుంచి 20 వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువిచ్చారు. అయితే సమయం సరిపోలేదని, కుల, ఆదాయ, నివాస ధ్రువపత్రాల కోసం ప్రభుత్వ కార్యాలయాలు, మీ సేవ కేంద్రాల చుట్టూ తిరిగేందుకే సమయం సరిపోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం 2021 ఏప్రిల్ 1 వరకు ఉన్న ఆదాయ ధ్రువీకరణ పత్రం సరిపోతుందని తెలిపింది. దీంతో అప్పటికే ధ్రువీకరణ పత్రాలున్న వారికి ఊరట కలిగినా, కొత్తగా ఆదాయ, కులం ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునేవారికి చాలా ఆలస్యమైందని ఆందోళన వ్యక్తం చేశారు.

పైరవీలకు అవకాశం..

కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీ సేవ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ నేరుగా అధికారులను కలిస్తే తప్పా ధ్రువీకరణ పత్రాలు జారీ చేయలేదన్న ఆరోపణలు వ్యక్తమయ్యాయి.



ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులెవరూ పట్టించుకోలేదని, నిర్లక్ష్య ధోరణి అవలంభించారని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేశారు. పైరవీలతోనే పనులు జరిగాయని, నేతల సిఫారసుకు పెద్దపీట వేశారని ఆరోపిస్తున్నారు. పలువురు అధికారులు దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమవడంతో ఆలస్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ధ్రువపత్రాల పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అయినా పారదర్శకంగా నిర్వహించాలని కోరుతున్నారు.

దరఖాస్తులు ఇలా..

- మేడ్చల్ –మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 22,077 దరఖాస్తులు రాగా, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 5,360 దరఖాస్తులు, ఉప్పల్ నుంచి 4,976, కుత్బుల్లాపూర్ నుంచి 4,617, కూకట్‌పల్లి నుంచి 4,076, మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 3,048 దరఖాస్తులు వచ్చాయి.
- మండలాలు, పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ సర్కిళ్ల వారిగా దరఖాస్తుల సంఖ్య ఈవిధంగా ఉంది. జిల్లాలో మొత్తం వచ్చిన 22,077 దరఖాస్తుల్లో బాలానగర్ మండలంలో 1,702 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, కూకట్‌పల్లిలో 2,374, అల్వాల్‌లో 730, మల్కాజిగిరిలో 2,318, ఘట్‌కేసర్‌లో 562, కీసరలో 745, మేడ్చల్ మండలంలో 601, మేడిపల్లి మండలంలో 329, ఎంసీపల్లిలో 230, శామీర్‌పేట్‌లో 522, కాప్రాలో 1,484, ఉప్పల్‌లో 3,492 దరఖాస్తులు వచ్చాయి. అలాగే, పురపాలక సంఘాల్లో దరఖాస్తులు ఇలా వచ్చాయి. బోడుప్పల్‌లో 484, దమ్మాయిగూడలో 159, ఘట్‌కేసర్‌లో 348, గుండ్లపోచంపల్లిలో 53, జవహర్‌నగర్‌లో 518, మేడ్చల్‌లో 130, నాగారంలో 96, పీర్జాదిగూడలో 408, తూముకుంటలో 42, దుండిగల్‌లో 729, కొంపల్లిలో 176, నిజాంపేట్లో 359, కుత్బుల్లాపూర్ మున్సిపల్ సర్కిల్‌లో 3,353 దరఖాస్తులు వచ్చాయి.

ఎంతో ఉపయోగం

ప్రభుత్వం కులవృత్తిదారులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా పూర్తి సబ్సిడీతో రూ.లక్ష ఆర్థిక సహాయం అందించనుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 22,077 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 26లోగా ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కానుంది. ఈ పథకంతో బీసీలకు ఎంతో ఉపయోగం. అధికారులు ధ్రువీకరణ పత్రాలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది అవాస్తవం. జీవో వచ్చిన రాత్రే కలెక్టర్ సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం చేయవద్దని ఆదేశించారు.

– కేశురామ్, జిల్లా బీసీ సంక్షేమం, అభివృద్ధి శాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి

కేసీఆర్‌కు లక్షల కోట్లు ఎలా వచ్చాయి..?

- తండ్రిని నమ్మడం లేదని కొడుకును పంపిస్తుండు..
- బాప్ ఏక్ నంబర్.. బేటా దస్ నంబర్..
- ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నం
- టీపీసీసీ అధ్యక్షుడు, మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: 'తెలంగాణ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. తండ్రిని నమ్మడం లేదని కొడుకును పంపిస్తుండు. బాప్ ఏక్ నంబర్.. బేటా దస్ నంబర్.. కేసీఆర్ కొడుకు కేసీఆర్ లాగే మోసం చేస్తాడు తప్ప ప్రజల కోసం ఆలోచించరు.. మూడోసారి ప్రజల్ని నట్టేట ముంచడానికి రెడీ అయ్యారు.. మళ్లీ మోసపోవద్దు.. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్కసారి అవకాశం ఇవ్వండి' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట మండలం తూముకుంట మున్సిపల్ కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్, బీజేపీ నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం వారిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 60 ఏండ్ల తెలంగాణ ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చారు. రాజకీయంగా నష్టపోయినా సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారు. సోనియా గాంధీకి కృతజ్ఞత తెలిపే బాధ్యత తెలంగాణ ప్రజలపై ఉందన్నారు. '1200 మంది అమరుల త్యాగాలను చులకన చేస్తూ నిన్న కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణ బిడ్డల ప్రాణాల విలువ నీకు తెలుసా కేసీఆర్? చేగువేరా, నెల్సన్ మండేలా, సుభాష్ చంద్రబోస్, గాంధీ కుటుంబాలు ఆర్థికంగా ఎలా ఉన్నాయో చూడండి. అడవి బిడ్డల కోసం కొట్లాడిన కొమురం భీం మనుమడు పేదరికంలో ఉన్నారు. చాకలి ఐలమ్మ వారసులు చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ప్రజల కోసం కొట్లాడిన కుటుంబాలు ఆదర్శంగా ఉంటూ పేదరికంలో బతుకుతున్నారు. 2001 సంవత్సరానికి ముందు కేసీఆర్‌కు తొడుక్కోవడానికి చెప్పులు లేవు.. ఇవాళ ఇన్ని లక్షల కోట్లు కేసీఆర్‌కు ఎలా వచ్చాయి..?' అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 220 ఏండ్లు ఏలిన తరువాత నిజాం ధనవంతుడు అయ్యాడు.. కానీ కేసీఆర్ పదేళ్లలో లక్షల కోట్లు సంపాదించారు. ఇలాంటి మీరా తెలంగాణ ఉద్యమకారులా? అని కేసీఆర్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'తెలంగాణ కోసం 1200 మంది ప్రాణత్యాగం చేస్తే ప్రభుత్వం గుర్తించింది కేవలం 528 మందిని మాత్రమే.. తొమ్మిదేళ్లలో అమరుల కుటుంబాలకు బుక్కెడు బువ్వ పెట్టారా? అసలు కేసీఆర్ మనిషా.. మానవ రూపంలో ఉన్న మృగమా? మళ్లీ వెట్టిచాకిరి విధానం తీసుకురావాలని కేసీఆర్ చూస్తున్నారు. ఆయన తరువాత కొడుకు.. ఆటుపై మనుమడు వస్తడట. తెలంగాణ ప్రజలను బానిసలుగా మార్చాలని చూస్తున్నారు' అని విమర్శించారు.

బీఆర్ఎస్‌ను బొంద పెట్టాలి..

పేదల బతుకులు బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన రిజర్వేషన్లతోనే దళిత బిడ్డలు ఉన్నతస్థానాలకు ఎదిగారన్నారు. కాంగ్రెస్‌ను ఎందుకు ఓడించాలో కేసీఆర్ చెప్పాలి.. తెలంగాణ ఇచ్చినందుకా? పేదలకు రిజర్వేషన్లు ఇచ్చినందుకా? నాలుగు కోట్ల ప్రజలను నమ్మించి మోసగించిన కేసీఆర్‌ను, ఆ పార్టీని బొంద పెట్టాలి అని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందు లక్ష్మాపూర్‌లో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమ్మరి ఎల్లవ్వ ఇంటి వద్ద గుమ్మడి కాయ కొట్టి పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. తూముకుంట సమావేశంలో రేవంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ చెందిన రాంచందర్‌యాదవ్‌తో సహా 100 మంది కాంగ్రెస్‌లో చేరినట్లు టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రకటించారు. ఆ తర్వాత జిల్లా ప్రెస్‌క్లబ్‌లో పాత్రికేయులతో రేవంత్‌రెడ్డి పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమాల్లో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర(వజ్రేష్) జంగయ్య యాదవ్, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు పోచయ్య, మహేష్ గౌడ్, నరసింహులు యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, రాజేష్, వైద్యనాథ్, జగన్నాథం, వీరేశం, హన్మంతరెడ్డి, అఖిలేష్‌రెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలి



- జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య.
- రూ.18,370 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక విడుదల

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. వ్యవసాయ రంగంతో పాటు చిన్న తరహా, మధ్యతరగతి పారిశ్రామిక రంగాలకు ప్రాధాన్యతనిచ్చేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరములో జిల్లాలోని బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి రూ.18,370 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను అదనపు కలెక్టర్ విడుదల చేశారు. గతేడాది రూ.16,373 కోట్లతో జిల్లా రుణ ప్రణాళికను రూపొందించగా, ఈయేడు మరింత ఎక్కువగా పెంచామన్నారు. ప్రతి బ్యాంకు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా రుణాలను అందజేయాలని ఆయన సూచించారు. రైతు రుణాల మంజూరుకు సంబంధించిన పూర్తి డేటాను బ్యాంకు అధికారులు, సిబ్బందితో కలిసి మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రుణాల మంజూరీలో బ్యాంకులు ఎంత వరకు లక్ష్యాలను చేరుకున్నారు. గ్రౌండింగ్ తదితర వివరాలను బ్యాంకర్ల వారీగా అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రుణ సదుపాయం అందించేలా వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు మేనేజర్లు చొరవ చూపాలన్నారు. సర్వీస్ సెక్టార్‌లో రుణాలు వేగవంతం చేయాలన్నారు. అర్హులైన దరఖాస్తుదారుల వివరాలను ఎప్పటికప్పుడు లిస్టవుట్ చేసి ఫాలోఅప్ చేయాలని ఆయన సూచించారు. ఈ విషయంలో బ్యాంకు అధికారులు ఏమాత్రం అలసత్వం, జాప్యం చేయకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి, సర్వీస్ సెక్టార్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి రుణాలు అందజేయాలన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతీ, యువకులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందజేయాలన్నారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాన్ని వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ఐ.శ్రీనివాసులు, ఆర్‌బీఐ ఎల్‌డీఓ తేజ్ దీపిత బెహరా, నాబార్డు డీడీఓ సురభి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ అధికారులు వినోద్, బాలాజీ, కేశురామ్, జిల్లా వ్యవసాయాధికారి మేరీ రేఖ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అత్వెల్లి బీఆర్ఎస్ నాయకులు

మేడ్చల్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందిన అత్వెల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డిని శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఈశ్వరయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు రవికుమార్ గ్రామస్తులతో కలిసి రాజిరెడ్డిని సన్మానించి ఆయన సేవలను ప్రశంసించారు. పాఠశాలకు చెందిన ఇతర ఉపాధ్యాయులను సైతం సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు అక్తర్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

మేడ్చల్: రోడ్డు భద్రతా నిబంధనలు, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా రహదారులపై తిరుగుతున్న వాహనాలకు చెక్ పెట్టేందుకు జాతీయ రహదారిపై మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. జాతీయ రహదారిపై చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి సీఐ నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. జరిమానాలు విధిస్తూ.. కౌన్సిలింగ్ చేస్తూ వాహనదారులను చైతన్య పరిచారు. ప్రధానంగా వాహనాల నంబర్ ప్లేట్‌లను కనిపించకుండా చేసే వారిపై కొరడా ఝులిపించారు. కార్యక్రమంలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్ ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



నంబర్ ప్లేట్లను పరిశీలిస్తున్న సీఐ నర్సింహారెడ్డి

దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రజల సొమ్ము వృథా



చలువాదీ ప్రవీణ్‌రావు

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల పేరుతో కోట్లాది రూపాయల పేదల సొమ్మును వృథా చేశారని బీజేపీ మండల అధ్యక్షుడు చలువాదీ ప్రవీణ్‌రావు విమర్శించారు. ఘట్‌కేసర్ పట్టణంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు సమయానికి వేతనాలు, ఆసరా లబ్ధిదారులకు పెన్షన్లు ఇవ్వకుండా తెలంగాణ ప్రభుత్వం గాలిలో మేడలు కడుతోందని, ధనిక ప్రభుత్వం అంటూనే రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేశారన్నారు. రాష్ట్రంలో మృతి చెందిన రైతుల కుటుంబాలను పరామర్శించకుండా ఇతర రాష్ట్రాల్లో మరణించిన రైతుల కుటుంబాలకు ఆర్థిక సాయం చేయడం తెలంగాణ రైతులను అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేస్తూ రైతు ప్రభుత్వమని ప్రకటించుకోవడం సిగ్గుచేటన్నారు.

ఎన్ఈపీతో చిన్నారుల భవిష్యత్‌కు పునాదులు

మల్లారెడ్డి మహిళా కళాశాలలో ఎన్ఈపీ వర్క్‌షాప్ ప్రారంభం

మేడ్చల్‌రూరల్: నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ(ఎన్ఈపీ) చిన్నారుల విద్యాభివృద్ధికి, వారి భవిష్యత్‌కు బలమైన పునాదులు వేస్తుందని ఏఐసీటీఈ సీసీఓ బుద్ధా చంద్రశేఖర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఈపీ వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం పాలసీ ద్వారా పిల్లల బాల్యాన్ని సంరక్షించి, విద్యకు ప్రాధాన్యం ఇస్తూ వారి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. బాల్యం నుంచే చిన్నారులకు నాణ్యమైన విద్యా అందించంతో వారి జీవితంలో విజయాలకు అండగా ఉంటుందన్నారు. ఇలాంటి వర్క్‌షాప్‌లను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎన్ఈపీ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న ఏఐసీటీఈ సీసీఓ బుద్ధా చంద్రశేఖర్

విద్యారంగ సమస్యలను మరిచిన ప్రభుత్వం



మేడ్చల్‌లో ఎస్ఎఫ్ఐ ప్రదర్శన

మేడ్చల్: విద్యారంగంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ప్రభుత్వం పూర్తిగా మరిచిపోయిందని జిల్లా ఎస్ఎఫ్ఐ కార్యదర్శి రాథోడ్ సంతోష్ అన్నారు. మేడ్చల్‌లో విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీన కలెక్టర్ కార్యాలయ ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం విద్యారంగ సమస్యలపై కనీసం దృష్టి సారించడం లేదన్నారు. తాము పోరాటాలు చేస్తున్నా స్పందించడం లేదన్నారు. పాలకులు, అధికారులను మేల్కొల్పేందుకు కలెక్టర్ కార్యాలయ ముట్టడి చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు కిరణ్, మౌలానా, శివ, శ్రీనివాస్, మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

25న రాష్ట్ర హోమియో వైద్య విజ్ఞాన సదస్సు

ఉప్పల్: రాష్ట్ర హోమియో వైద్య విజ్ఞాన సదస్సును రామంతాపూర్‌లోని ఇందిరా ఇంపీరియా హాల్‌లో ఈ నెల 25 తేదీన నిర్వహించనున్నట్లు ఐఐహెచ్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఎమ్ఎన్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు హాజరవుతున్నట్లు తెలిపారు. డా.ఎస్.వేణుగోపాలచారి, ఆయుష్ కమిషనర్ ప్రశాంతి, అడిషనల్ డైరెక్టర్ డా.లింగరాజు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సదస్సులో సుప్రసిద్ధ హోమియో వక్తలు పాల్గొని తమ సందేశాలను అందిస్తారన్నారు. ఆధునిక హోమియో చికిత్స విధానాలు, కేన్సర్ వంటి వ్యాధులకు మెరుగైన చికిత్సలు, అత్యవసర సమయాల్లో గుండెపోటుతో రోగి పరిస్థితులపై చర్చించనున్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి



మేడ్చల్‌లో శ్యాంప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు



శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, నాయకులు

మేడ్చల్: బీజేపీ బలిదాన్ దివస్‌గా నిర్వహించే శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని మేడ్చల్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు నిర్వహించి నివాళులర్పించారు. పట్టణంలోని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహం వద్ద శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, జగన్‌గౌడ్, ప్రేందాస్, లక్ష్మారెడ్డి, నరేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్‌రూరల్: బలిదాన్ దివాస్ సందర్భంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బీజేపీ నాయకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీ అంబేద్కర్ విగ్రహం సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ సరస్వతి నివాళులర్పించి ఆయన సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, కావేరి శ్రీధర్, విక్రం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

మేడ్చల్: పట్టణంలోని అత్వెల్లి మూడవ వార్డు పరిధిలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ ఏర్పాటుకు కాలనీవాసులు శుక్రవారం భూమిపూజ చేశారు. కాలనీచౌరస్తా వద్ద కాలనీవాసుల సహకారంతో ఏర్పాటు చేస్తున్న విగ్రహ ప్రతిష్టకు నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యమకారులను ఈ సందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ మల్లారెడ్డి, టీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, ఉద్యమకారులు సంజీవరావు, ప్రవీణ్, విఠల్, చారి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఉద్యమకారులు, నాయకులు

వడ్డెర ఆత్మ గౌరవ భవనాన్ని ప్రభుత్వమే నిర్మించాలి



మంత్రి గంగుల కమలాకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న వడ్డెర సంఘం ప్రతినిధులు

ఉప్పల్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కేటాయించిన ఆత్మగౌరవ భవనాల నిర్మాణం ట్రస్ట్‌లకు కాకుండా ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరుతూ వడ్డెర కులస్తుల ప్రతినిధులు శుక్రవారం మంత్రి గంగుల కమలాకర్‌ను కలిసి వినతి ప్రతాన్ని అందజేశారు. ఉప్పల్ భగాయత్‌లో వడ్డెర కులస్తులకు ఎకరా స్థలంతో పాటు భవనం నిర్మాణానికి రూ.కోటి కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ట్రస్టు చైర్మన్‌కు బాధ్యతలు అప్పజెప్పడంపై వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం వడ్డెర ఫెడరేషన్ ద్వారా భవనాన్ని నిర్మించుకునే విధంగా ఆదేశాలు ఇవ్వాలని వారు మంత్రిని కోరారు. మంత్రికి వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు దండుగుల రాజ్యలక్ష్మీ, ఎత్తారి మారయ్య, పల్లపు మోగిలి, శ్రీనివాస్ ఉన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387